క్షణాలు భారంగా, బరువుగా కదిలి, కరిగిపోతున్నాయి.

జీవితంలో ఎప్పుడూ ఎదురవ్వని ఘోరమైన అవమానం. అదీ తనని ఎంతగానో ప్రేమించిన మహతి ద్వారా.

మధుకర్‌లో ఆ షాక్‌కి గడ్డకట్టిన రక్తం ఒక్కసారి ఉవ్వెత్తున పెనుతుఫానులా రేగి అతన్ని కుదిపివేసింది. ఆగ్రహా వేశాలతో ఊగిపోయాడు. కళ్ళు రక్తం చిమ్ముతున్నట్లుగా ఎర్రబారాయి.

ఎంతో ఆరోగ్యంగా, దృఢంగా ఉండే మధుకర్ శరీరం ఉద్రేకంతో, ఉద్వేగంతో వణికిపోతోంది.

ఒక్కసారి నిర్జీవ పదార్థానికి చలనం వచ్చినట్లయింది.

మధుకర్ పెనువేగంతో కదిలి రెండంగల్లో మహతిని సమీపించి, పట్టరాని ఆగ్రహావేశాల్ని ప్రదర్శిస్తూ, ఆమె కళ్ళలోకి చూశాడు.

మహతి భయపడలేదు.

అంతకు ముందు ఎలా వుందో అలాగే, నిశ్చలంగా, అదే స్థాయి నిబ్బరంతో మధుకర్ కళ్ళలోకి చూసింది.

ఏదో చేయాలి! తనకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలి. అదేమిటి? ఎలా? అనే సందిగ్ధత నడుమ కొద్దిక్షణాలూగిపోయాడు మధుకర్ .

మహతిని ఎప్పటికయినా తన భార్యగా చేసుకుతీరాలి. అదే నిశ్చయమనుకున్నప్పుడు తనప్పుడు ఏ అవమానం చేసినా, తిరిగి అది తనమీదే రిఫ్లెక్ట్ అవుతుంది.

మహతి భవిష్యత్ తనకక్కర్లేదని అనుకుంటే తనిప్పుడు ఏమిచేసినా తనలో రేగిన పగ, ప్రతీకారం చల్లారిపోతాయి. అవమానభారం ఉపశమింపబడుతుంది. కానీ తను ఆమెను కోరుకుంటున్నాడే?

ఎలా? ఏం చేయాలి? అని అతడు మీమాంస అంచుల్లో కొట్టుమిట్టాడుతుంటే- కోట్లకు కోట్ల సంపదకు వారసుడయిన మధుకర్ తలచుకుంటే ఆమెని అక్కడికక్కడ ముద్దు పెట్టుకోగలడు, రేప్ చేయగలడు. కానీ అలాంటివి చేసే ప్రయత్నంలో లేనట్లుగా ఉన్నాడే అని చాలా మంది బాధపడిపోతున్నారు.

మధుకర్ భౌతికపరమైన ప్రతిస్పందన ఎలా ఉంటుందనేది ఎవరికీ అర్థం కావటం లేదు. అనూహ్యంగా కూడా వుంది.

మరికొద్ది క్షణాలు .....

మధుకర్ ఆమె భుజాన్ని పట్టుకున్నాడు.

ఒక్క క్షణం ఆమెను కుదిపివేసాడు. నిలదీస్తున్నట్లుగా. అందుకామె ముఖంలో ఎలాంటి ప్రతిస్పందన కనిపించలేదు. నో రియాక్షన్! నిర్వికారంగా, నిర్లక్ష్యంగా కనిపించింది.

ఏమిటామె ధైర్యం?

అప్పుడు ..... ఆ క్షణాన మధుకర్ తలుచుకుంటే ఏదయినా చేయగలడే! అతనికి అడ్డువచ్చే వారెవరూ లేరే! మరేమిటామె తెగువ? ధైర్యం?

సంగీతా బిజ్‌లానీ షేప్‌లో తీర్చిదిద్దినట్లుండే అందమైన మహతి, ఆమె అందమైన బరువైన హిమోన్నతాలు, ఆమె వేసుకున్న చోళీ మాటున ఊగిపోయాయి. మధుకర్ ఆమె భుజాల్ని పట్టుకొని కుదిపిన చర్యకు లేత పసుపుపచ్చ రంగులో ఒకింత పారదర్శకంగా ఉన్న ఆమె చోళీ లోపల వున్న బ్రాసియర్ అస్పష్టంగా కనిపిస్తోందందరికీ. క్లీ వేజ్‌లో సన్నని బంగారపు గొలుసు శంఖంలాంటి మెడ. పేల్ ఎల్లో కలర్ బంగారంతో కలిసినట్లుండే ఆమె మెడ నిర్మలంగా, ఆరోగ్యంగా, ఆకర్షణీయంగా మెరుస్తోంది.

ఆ మాత్రమైనా ఆమెను ముట్టుకున్న మొట్టమొదటి మగవాడు మధుకర్ కావటం అక్కడున్న చాలామందిలో అసూయని రగిలించింది.

ఆ ప్రాంతం నుంచి సాగిపోతున్న చిరుగాలి- మెత్తటి ఒత్తిడికి - నల్లటి మేఘంలా ఆమె వీపంతటినీ పర్చుకున్న పట్టుకుచ్చులాంటి మృదువయిన ఆమె జుత్తు, పచ్చటి పైరు చివర లేత చిగురుల్లా అలల్లా కదిలిపోతున్నాయి. బాపూ కుంచె చివరనుంచి జారిన నండూరి ఎంకిలా ఉన్న మహతి కేసి చూస్తున్నారు, అక్కడ గుమికూడిన విద్యార్థులు- కన్నార్పటం మర్చిపోయి.

అంతలో అన్నాడు. మధుకర్ బిట్టర్‌గా--

"ఇదే నీకిస్తున్న ఆఖరి అవకాశం! మరోసారి నన్ను అవమానించే ప్రయత్నం చేస్తే, ఫలితం దారుణంగా వుంటుంది. ఇకపై నీ జోలి నా కనవసరం. నాజోలి నీ కనవసరం అని గుర్తుంచుకో" అని అంటూనే ఆమె భుజాన్ని విసురుగా వదిలేసి వడివడిగా ఆ ప్రాంతంనుంచి అదృశ్యమైపోయాడు.

ఏదో అవుతుందని కొంతసేపు, ఏమీ అవ్వకుండానే దృశ్యం చప్పబడిపోయిందే అని, ఆ తరువాత అనుకొని వాపోతూ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు, చుట్టూ గుమికూడినవాళ్ళు.

* * * *

క్రా ఫోర్డ్ సెంటర్ లో సడెన్‌గా నాలుగు కార్లు, రెండు జీపులు వచ్చి ఆగాయి.

ఒక కారులోంచి రాఘవేంద్ర నాయుడు  దిగి, నలువేపులా క్రితం కన్నా మరింత పరిశీలనగా చూసాడు. ఆ వెనుకే అర్బన్ డెవలప్ అథారిటీ చెయిర్‌మెన్ దిగాడు ఆదరా బాదరాగా.

" స్థలం ఇప్పించమని ఏదయినా గవర్నమెంట్ ఆర్గనైజేషన్ మీకు అప్లికేషన్ పెట్టుకుందా?" రాఘవేంద్ర నాయుడు ప్రశ్నించాడు.

"పెట్టుకున్నాయి."

"ఏ ఏ సంస్థలు"

"ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ కట్టుకోవటం కోసం- రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌వాళ్ళు- ఒ.ఎన్.జి.సి. వాళ్ళు అడిగారు.

"మీరేమన్నారు?"

"ఇంకా ఏమనలేదు అయినా మా చేతిలో స్థలం ఉండాలిగదా?"

"కుడివైపు స్థలం ఇస్తే పోలా?"

"కుడివైపు స్థలమా! అది మా సంస్థది కాదే."

"అయితే డ్రామా ఏముంది! మీదికాని స్థలాన్ని ముందు మీ స్థలంగా చేద్దాం. ఆ పైన ఒ.ఎన్. జి.సి కి ఇచ్చేయండి. గొప్ప భవిష్యత్ ఉన్నది ఓ.ఎన్.జి.సి.కే - దాంతో ఈ ఏరియాకి డిమాండ్ పెరుగుతుంది"

రాఘవేంద్ర నాయుడు అన్నదేమిటో ముందు అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్‌కి అర్థంకాలేదు. కొద్ది క్షణాలకు అర్థం చేసుకొని ఒక ప్రశ్న వేశాడు--

" ఈ ఏరియాకి విలువ పెరగాలని ఎందుకనుకుంటున్నారు?"

"ఆ ఎడం వేపున్న బార్‌ని నేను నష్టానికి కొన్నాను కనుక."

ఇద్దరి మధ్యా కొద్దిక్షణాలు నిశ్శబ్దం అలుముకుంది.

"ఆ ప్రక్కనే మీ యు.డి.ఏ కాంప్లెక్స్ కట్టండి. అందుకు నేను మీకు లోన్ ఇప్పిస్తాను. ఈ ఏరియాకి విలువ పెరగకుండా ఉండదు కదా?"

"లోన్ అదీ ..... అసలే మా సంస్థ జీతాలిచ్చుకోలేని స్థితిలోవుంటే, ఏ బ్యాంకు మాత్రం లోనిస్తుంది సార్?"

సందేహం మీద సందేహం యు.డి.ఏ చైర్మన్‌ని చుట్టుముట్టాయి.

"నాకు ఫైనాన్స్ బిజినెస్ ఉంది. ఫైనాన్స్ నేను చేస్తాను. పూర్తయ్యాక రెండు ఫ్లోర్స్ నేను మీ నుంచి లీజ్‌కి తీసుకుంటాను. మిగతా పది ఫ్లోర్స్ మీరు అద్దెకు ఇచ్చుకోండి. ఇటు నా అప్పూ తీరుతుంది. అటు మీకూ ఆదాయం పెరుగుతుంది. ఆ

బిల్డింగ్ మీ సంస్థ స్వంతమౌతుంది. వెళ్దామా!” కారెక్కుతూ అన్నాడు రాఘువేంద్ర నాయుడు.

క్షణాల్లో కోట్ల వ్యాపారానికి సంబంధించిన నిర్ణయం తీసుకోవటం ఉత్తమ వ్యాపారస్తుడి లక్షణమా? అలా సత్వర నిర్ణయాలు తీసుకోబట్టే రాఘువేంద్ర నాయుడు ఆ స్థాయికి ఎదిగాడా?

తమ సంస్థకు ఫైనాన్స్ చేయటం ఒక వ్యాపారం.

రెండు ఫ్లోర్స్ లీజ్‌కి తీసుకోవటం మరో వ్యాపారం. ఒ.ఎన్.జి.సి. కి స్థలం ఇప్పించి, ఏరియా విలువ పెరిగేలా చేయటం మరో వ్యాపారం. ఆపైన తన స్థలం విలువను లక్షల్లోకి తీసుకెళ్ళటం అద్భుతమైన వ్యాపార సూత్రం.

తను బాగుపడుతూ- తనతో ముడిపడిన చిన్న వ్యాపార సంస్థల్ని కూడా పైకి తీసుకెళ్లటం అత్యుత్తమ వ్యాపారస్తుడి లక్షణం కాబోలు.

అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ పదవి శాశ్వితం కాదు- రేపు సి.ఎమ్. మారితే తను దిగక తప్పదు. అలాంటి తుమ్మితే ఊడే పదవిని అడ్డం పెట్టుకొనే తనిప్పుడు రాఘువేంద్ర నాయుడు లాంటి ఇండస్ట్రియల్ ఎంపరర్‌తో తన స్నేహాన్ని పెంచుకుంటే, తనకో భవిష్యత్ ఉంటుంది.

తనకి తీరిక లేకో- తన స్థాయికి తగకో కొన్ని వ్యాపారాలు రాఘువేంద్ర నాయుడు లాంటి పారిశ్రామికవేత్తల దృష్టికి వచ్చినా చేపట్టరు.

తనిప్పుడు ఆయన చెప్పినట్లు చేస్తే- అలాంటి వ్యాపారాలేవో తనతో పెట్టించే అవకాశం ఉంటుంది. మరో ప్రక్క యు.డి.ఏకి ఆదాయం వచ్చే వనరుల్ని సమకూర్చినట్లవుతుంది. ఒక చోటా రాజకీయవేత్తగా - ప్రభుత్వ సంస్థని సమర్థవంతంగా నిర్వహించిన పేరు ప్రతిష్టలు దక్కుతాయి.

ఎవరి జాతకమైనా గొప్ప మలుపు తిరగాలంటే- కింగ్‌మేకర్స్ చేతుల్లోనే పడాలి- వారి దృష్టికి వెళ్లాలి.

కొద్ది క్షణాల్లోనే ఇవన్నీ ఆలోచించిన యు.డి.ఏ ఛైర్మన్ , రాఘవేంద్ర నాయుడి ప్రపోజల్స్ అన్నిటికీ తన  అంగీకారం తెలిపాడు.

“మీరు కట్టించే పన్నెండు ఫ్లోర్స్‌లో నాకు రెండు ఫ్లోర్స్ పోగా, మిగతా పది ఫ్లోర్స్‌ని స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి లీజ్‌కివ్వాలి” తిరిగి అన్నాడు రాఘవేంద్ర నాయుడు కారులో వెళుతున్నప్పుడు.

“స్టాక్ ఎక్స్ఛేంజా! అదసలు మన నగరంలో లేదుగా? దానికి అద్దెకివ్వటమేమిటి సార్?” యు.డి.ఏ ఛైర్మన్‌కి మతిపోతోంది.

“వస్తుంది- మనం తలుచుకుంటే రాదా? చూస్తుండగానే దాన్ని ఈ నగరానికి రప్పిస్తాను ..... ఇకపై ఇవన్నీ మా ఫైనాన్స్ సెక్రటరీతో మాట్లాడండి. ప్రతిదీ యుద్ధప్రాతిపదికపై పూర్తవ్వాలి. నేనీ రాత్రికే ఓ.ఎన్.జి.సి. ఛైర్మన్‌తో మాట్లాడతాను. అర్థమైంది కదా?” రాఘవేంద్ర నాయుడు కళ్ళు మూసుకొని సీటుకి జారగిలబడుతూ అన్నాడు.

అసలిప్పుడు జరిగినవన్నీ నిజాలా?

కలా ..... ?

ఎక్కడో ఏదో జరిగివుంటుంది- అది ఆయన్ని కదిలించివుండాలి- అలాంటప్పుడే కదా రాజు కోట నుంచి వెడలేది ..... వెడలాక రవితేజములదరక ఏమవుతుంది?

*            *            *            *